# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర వ్యాప్తంగా "ముస్తాబు" కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు.
- ❖ "అమరజీవి జలధార" ప్రాజెక్టు ద్వారా ఐదు జిల్లాలకు రక్షిత మంచినీరు అందుతుందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.
- ❖ సాంకేతికత సహాయంతో ఆధునిక పోస్టాఫీసులను తయారు చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.
- ❖ విశాఖ అభివృద్ధితోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు.

=======================

రాష్ట్రానికి భవిష్యత్ తరాలుగా ఉన్న విద్యార్థులకు మేలు చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినులతో ముఖ్యమంత్రి ఈ రోజు సమావేశమయ్యారు. ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించే విధానాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాళ్లపాలెం రెసిడెన్షియల్ పాఠశాల నుంచే రాష్ట్రవ్యాప్తంగా ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు మంచి భవిష్యత్‌ని ఇచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

ఇదిలా ఉండగా రాష్ట్రాన్ని 2026 జూన్ నాటికి ప్లాస్టిక్ రహితంగా మార్చాలన్నది ప్రభుత్వం ఆలోచనగా ఉందని చంద్రబాబు నాయుడు తెలిపారు. తాళ్ళపాలెంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర సచివాలయంలో ప్లాస్టిక్ నివారించామని చెప్పారు. అదే విధంగా 2026 జనవరి 26 నుండి రోడ్లపై చెత్త అనేది కనబడకుండా ఉండాలన్నది ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

======================

రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల పరిధిలో “అమరజీవి జలధార” ద్వారా చేపట్టిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం 7 వేల 910 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పెరవలిలో జరిగిన అమరజీవి జలధార శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలుగువారికి ఉనికిని ఇచ్చిన నాయకుడు అమరజీవి పొట్టి శ్రీ రాములు పేరును ఈ ప్రాజెక్టుకు పెట్టామని చెప్పారు. 2027 నాటికి ప్రాజెక్ట్ పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి అధికారులను కోరారు. ఈ ప్రాజెక్టు ద్వారా కోటి 21 లక్షల మందికి దాహార్తి తీర్చాలని సంకల్పించామని చెప్పారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తీర ప్రాంతం వెంబడి నివసించే మత్స్యకారులకు ఈ ప్రాజెక్టు ద్వారా గరిష్టంగా ప్రయోజనం చేకూరుతుందని పవన్ కళ్యాణ్ తెలిపారు.

======================

సాంకేతికత సహాయంతో ప్రైవేట్ కొరియర్ సర్వీసులకు దీటుగా ఆధునిక పోస్టాఫీసులను తయారు చేస్తున్నామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అమరావతిలోని విట్ యూనివర్సిటీలో జెన్ జీ పోస్టాఫీసును ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగులందరినీ సమర్థవంతంగా ఉపయోగించుకుంటే దేశంలోనే పటిష్టమైన శాఖగా పోస్టల్ విభాగం నిలుస్తుందన్నారు. రైల్వే శాఖ తరువాత అత్యధికంగా పోస్టల్ శాఖలో 4 లక్షల 50 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

విరామం

======================

విశాఖ అభివృద్ధితోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. విశాఖపట్టణంలో ఈ రోజు జరిగిన అటల్, మోదీ సుపరిపాలన యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్ పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వాజ్ పేయి ప్రధానిగా దేశాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. దేశంలోని జాతీయ, గ్రామీణ రహదారుల అభివృద్ధికి వాజ్ పేయి శ్రీకారం చుట్టారన్నారు. ఆయన స్ఫూర్తితో నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధితో పాటు దేశంలో అనేక సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని బండి సంజయ్ కుమార్ వివరించారు. మూడు సార్లు ప్రధానిగా వాజ్ పేయి పని చేశారని, దేశంలో పారదర్శక పాలన అందించారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

======================

రానున్న మూడేళ్ళలో ఉత్తరాంధ్రలో అన్ని నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను త్వరలోనే అనకాపల్లికి తీసుకుని వస్తామని చెప్పారు. అదే విధంగా గోదావరి, వంశధార నదులను అనుసంధానం చేస్తామని ప్రకటించారు. అనకాపల్లి జిల్లా పరిశ్రమల హబ్ గా మారిందని అన్నారు. అనకాపల్లిలో ఆర్గానిక్ బెల్లం తయారు చేస్తే ప్రపంచానికి ఎగుమతి చేయవచ్చునని, ఆ విధమైన చర్యలను తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

======================

ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయాలను పాత్రికేయులు సరైన అవగాహనతో ప్రజలకు చేరవేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం వి.ఎస్.ఎం. ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఈ రోజు ప్రారంభమైన జిల్లా గ్రామీణ విలేఖరుల పునశ్చరణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కొత్త కార్మిక చట్టాల వల్ల కార్మికుల పని వేళలు సజావుగా ఉండడమే కాకుండా అధిక వేతనాన్ని లభించే విధంగా చేస్తాయని తెలిపారు. పాత్రికేయులు సైతం కార్మికులే అని అన్నారు. విధి నిర్వహణలో వారు అనేక రకాలైన సమస్యలను ఎదుర్కొంటున్నారని మంత్రి పేర్కొన్నారు.

=======================

రాష్ట్రంలో అయిదేళ్ళ లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి కోరారు. రేపు నిర్వహించే పల్స్ పోలియో శిబిరాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. భీమవరం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని పల్స్ పోలియో అవగాహన ర్యాలీని ఆమె ఈ రోజు ప్రారంభించారు.

=======================

భారతదేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని రాష్ట్ర యువజన వ్యవహారాల శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రపంచాన్ని శాసించే శక్తి దేశ యువతదే అని ఆయన స్పష్టం చేశారు. గుంటూరులో యువజనోత్సవల ముగింపు వేడుక సందర్భంగా ఈ రోజు జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇలాంటి వేదికలు తోడ్పడతాయని అన్నారు.

=======================

కర్బన రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ని మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రాప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎమ్) చైర్మన్ కె. విజయానంద్ కోరారు. విజయవాడలో ఇంధన శాఖ ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఇంధన పరిరక్షణలో గత నాలుగేళ్లుగా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలుస్తోందని తెలిపారు. విశాఖ నగరంలోని వీధి దీపాలన్నింటినీ ఎల్ఈడీ లైట్లుగా మార్చామని, దీని వల్ల దాదాపు 45 శాతం వరకు ఇంధన పొదుపు సాధ్యమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2 కోట్లకు పైగా ఇళ్లకు ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేశామని, దీంతో 30 శాతం విద్యుత్ ఆదా అయిందన్నారు. ప్రతి గ్రామంలో సౌర విద్యుత్ ని ప్రోత్సహించడం ద్వారా మరింతగా విద్యుత్ ని ఆదా చేయగలమని తెలిపారు.

=======================
=======================